సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 25 । మార్చి । 2024



విభిన్న ప్రతిభావంతులకు..

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకరణాలు అందజేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. - 8లో



రట్టికి పోటెత్తిన భక్తజనం

రట్టి వల్లభ నారాయణ స్వామి యాత్రకు జనం పోటెత్తారు. నేడు చివరి రోజు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ	మంగళ
సాయంత్రం	ఉదయం
6.10	4.39

న్యూస్‌రీల్

ఆదిత్యునికి రూ.5.24 లక్షల విలువైన బంగారు హారం



అజ్ఞాత భక్తుడు ఇచ్చిన బంగారు హారం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టు అలంకరణకు మరో విలువైన బంగారు హారం సిద్ధమైంది. ఆదిత్యుడిని నిత్యం కొలుస్తున్న ఓ అజ్ఞాత భక్తుడు ఏకంగా రూ.5,24,962 విలువైన బంగారు హారాన్ని విరాళంగా ఆదివారం ఉదయం ఆలయ అధికారులకు సమర్పించారు. మొక్కు చెల్లింపులో భాగంగా ఈ హారాన్ని స్వామికి సమర్పిస్తున్నట్లుగా గుప్తదాత ప్రకటించారు. 93 గ్రాముల 830 మిల్లీ గ్రాములున్న ఈ బంగారు హారాన్ని ముందుగా ఆదిత్యుని మూల విరాట్టు వద్ద ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యుల సమక్షంలో దీన్ని అధికారికంగా భద్రపరిచారు.

ఘనంగా కామదహనోత్సవం



కామదహనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధిలో ఉన్న ఉమా రుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కామదహనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి గుడివీధి కూడలిలో అగ్నిజ్వాలను ఏర్పాటుచేసి కామదహనోత్సవ వేడుకలు చేశారు. పున్నమి సందర్భంగా సోమవారం డోలో మండపంలో డోలోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులంతా డోలో మండపానికి ఉదయం 8.30గంటలకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మునగవలస సుకన్య, ట్రస్టు బోర్డు చైర్మన్ సుంకరి కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆటో నుంచి జారి పడి వ్యక్తి మృతి

గార: శ్రీకూర్మం పంచాయతీ కంద్రపేట వద్ద ఆదివారం ఆటో నుంచి జారి పడిన వృద్ధుడు రావాడ చిన్నవాడు (73) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోటబొమ్మాళి మండలం చిన్నతుంబయ్యపేట గ్రామానికి చెందిన చిన్నవాడు శ్రీకూర్మనాథాలయంలో జరుగుతున్న డోలోత్సవాల్లో భాగంగా కె.మత్స్యలేశం సముద్ర స్నానాలకు ఉదయం 11 గంటల సమయంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో వస్తుండగా కంద్రపేట వద్ద జారి పడటంతో గాయాలయ్యాయి. శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఎలుగు ప్రభావిత ప్రాంతాల్లో అవగాహన



అక్కుపల్లి గ్రామంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన జాగ్రత్త బోర్డులు

కాశీబుగ్గ: ఎలుగు బంట్ల ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం అటవీ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలంలో శనివారం ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి చంపేసిన విధానంపై అధికారులు అప్రమత్తమయ్యారు. కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం రేంజర్ మురళీకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పలు చోట్ల జాగ్రత్తలకు సంబంధించిన సూచికలు, బోర్డులు ఏర్పాటు చేశారు. ఎలుగుబంట్లు వచ్చే సమయాలు, ఎదురుపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి విషయాలు చిత్రాలతో ముద్రించి పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని పలు గ్రామాలలో ఏర్పాటు చేశారు.

షేమ్ సీన్..!



- ఆశీర్వాదం కోసం కలమట ఇంటికి వెళ్లిన పాతపట్నం టీడీపీ అభ్యర్థి మామిడి గోవింద్
- మా ఇంటికి ఎందుకు వచ్చావంటూ తిరగబడిన కలమట కుమారుడు సాగర్
- వెన్నుపోటు పొడిచారంటూ మామిడిని కడిగేసిన కలమట అనుచరులు
- మొన్న శ్రీకాకుళంలో గొండు శంకర్‌కు అదే అనుభవం

సీటు తెచ్చిన చేటు జిల్లా టీడీపీని ఒక పట్టాన వదలడం లేదు. ముఖ్యంగా శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో రోజురోజుకూ ఈ అగ్గి మరింతగా రాజుకుంటోంది. టికెట్ దక్కని నాయకులు అనుచరులతో సమావేశాలు నిర్వహించి సొంత ప్రణాళికలు రచిస్తుంటే.. టికెట్ దక్కించుకున్న వాళ్లు సీనియర్ల వద్దకు వెళ్లి చల్లబరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ ఇంటి గుమ్మం వద్దే నిలబెట్టి కడిగేస్తుండడంతో ఏమీ చేయలేక అవమాన భారంతో కుంగిపోతున్నారు. మొన్న శ్రీకాకుళంలో గొండు శంకర్‌కు, నిన్న పాతపట్నంలో మామిడి గోవింద్‌కు ఇదే చేదు అనుభవం ఎదురైంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పాతపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావుకు చేదు అనుభవం ఎదురైంది. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నుంచి టిక్కెట్ ఆశించి భంగపడిన కలమట వెంకటరమణమూర్తిని కలిసేందుకు మామిడి గోవిందరావు ఆదివారం ఆయన ఇంటి వద్దకు వెళ్లారు. అప్పటికే కటమట ఇంటి వద్దకు అధిక సంఖ్యలో వచ్చి ఉన్న కలమట వర్గీయులు, కలమట వెంకటరమణ కుమారుడు సాగర్ ఇంటి బయటే మామిడిని నిలదీశారు. అంతా కలిసి కలమట ఇంటిలోకి రానీయకుండా వెనక్కి పంపించారు. '50 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న కలమట కుటుంబానికి వెన్నుపోటు పొడిచిన నువ్వు కలమట వెంకటరమణ ఆశీర్వాదం కోసం వచ్చావా' అంటూ నిలదీశారు. ఇదే సీన్ శనివారం శ్రీకాకుళం నియోజకవర్గంలో టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన గుండ లక్ష్మీదేవి, అప్పలసూర్యనారాయణ దంపతుల ఇంటి వద్ద జరిగింది. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి టీడీపీ టిక్కెట్ సంపాదించుకున్న గొండు శంకర్ గుండ దంపతుల ఆశీర్వాదం కోసం వారి ఇంటికి వెళ్లారు. గొండును కూడా గుండ దంపతులు, వారి అభిమానులు ఇంట్లోకి రానీయకుండా అడ్డుకున్నారు.

పొలిటికల్ హీట్

కలమట మండిపాటు

తనకే టికెట్ వస్తుందని ఆశించి భంగపడిన కలమట వెంకటరమణ ఆగ్రహంతో మండిపడుతున్నారు. పాతపట్నం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఒక 420, మోసగాడు అయిన మామిడి గోవందరావును ప్రకటించారని అధిష్టానం తీరుపై ఆయన మండి పడుతున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడు, పార్టీ శ్రీకాకుళం పార్లమెంటు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కూన రవికుమార్‌లు వారి స్వార్థ రాజకీయాలు కోసం తనను మోసం చేశారని ఆరోపిస్తున్నారు. వారం పది రోజుల్లో టీడీపీ అధిష్టానం నిర్ణయం మార్చుకోకపోతే ఇంటిపెండెంట్‌గా పోటీ చేస్తామని కలమట చెబుతున్నారు.

అంతా కుట్రపూరితం

- మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

ఎల్.ఎన్.పేట/కొత్తూరు: జిల్లాలోని టీడీపీ రాజకీయాలు కుట్ర కోణంలో సాగుతున్నాయని, ఒక కుటుంబం కనుసన్నల్లో అంతా జరుగుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆరోపించారు. కొత్తూరు మండలం నివగాం వద్ద ఆయన ఆదివారం తన అనుచరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో సీనియర్ నాయకులైన గుండ, కలమట కుటుంబాలకు చెందిన వారిని పోటీలో లేకుండా చేస్తే ఎంపీ ఎన్నికపై ప్రభావం పడుతుందన్నారు. తనకు టికెట్ రాక పోవడానికి ప్రధానం కారణం అచ్చెన్నాయుడేనని పరోక్షంగా వ్యాఖ్యానించారు. కూన రవికుమార్‌కు కూడా ఇందులో భాగస్వామ్యం ఉందన్నారు. చంద్రబాబు పాతపట్నం సీటు కోసం పునరాలోచన చేయాలన్నారు. ఒకవేళ జరగకుంటే అందరి అభిప్రాయం మేరకు స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగుదామని అన్నారు. సైట్లు ఇస్తామని చెప్పి కొన్ని వేలమంది నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఒక 420 మామిడి గోవిందరావుని తెచ్చి పాతపట్నం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేగా పెడతామంటే ఒప్పుకునేది లేదన్నారు. డబ్బులు లేవని పార్టీ టికెట్ ఇవ్వక పోవడమంటే ఇంతకంటే మోసం మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల నుంచి టీడీపీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'కళా' విహీనం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల సీటు బీజేపీకి కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తుండడంతో ఇక్కడ టీడీపీ 'కళా'విహీనంగా కనిపిస్తోంది. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల టీడీపీ నాయకులు కళా వెంకటరావును అమరావతిలో ఆదివారం కలిశారు. టిక్కెట్ దక్కక పోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని కోరారు. అయితే చంద్రబాబు, అచ్చెన్నాయుడుపై కళా వెంకటరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎచ్చెర్ల నాయకులకు కళా ఫోన్ చేసి ప్రెస్‌మీట్ పెట్టాలని సూచించగా అది కూడా మొక్కుబడిగానే కానిచ్చేశారు.

అచ్చెన్నకు ఎందుకంత కక్ష



సమావేశంలో మాట్లాడుతున్న గుండ లక్ష్మీదేవి అనుచరులు

- మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ
- తమ వర్గీయులతో సమాలోచనలు

శ్రీకాకుళం: కింజరాపు అచ్చెన్నాయుడు తన కుటుంబంపై ఎందుకో కక్ష కట్టారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు గుండ దంపతులు ఆదివారం సమావేశం నిర్వహించారు. తనపై జరిగిన కుట్ర జరిపి తప్పుడు సమాచారం ఇచ్చి టికెట్ రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2004, 2009లో తన ఓటమికి కారణం ఎవరో నియోజకవర్గంలో ప్రజలకు తెలిసిందేనని అన్నారు. రెండు రోజులుగా తనకు కొందరు ఫోన్ చేసి ఎంపీ వల్లే టికెట్ రాలేదని చెబుతున్నారని అన్నారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ రెండేళ్లుగా గొండు శంకర్ కార్యకర్తలను రెండుగా విడదీస్తున్న విషయాన్ని అచ్చెన్నాయుడు దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని, శంకర్‌ను ప్రోత్సహిస్తూ వచ్చా రని అన్నారు. అధిష్టానం నిర్ణయం మారకుంటే స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తామన్నారు.

వైఎస్ జగన్‌ను స్ఫూర్తిగా తీసుకుందాం..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించినప్పుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకువెళ్దామని గుండ వర్గీయులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. అప్పట్లో వైఎస్ జగన్ కాంగ్రెస్‌ను కాదని ఎదురించి నిలబడ్డారని, మనం కూడా ఎదురిద్దామని అన్నారు. స్వతంత్ర్య అభ్యర్థిగా కచ్చితంగా పోటీ చేయాల్సిందేనని పట్టు పట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా గుండ లక్ష్మీదేవితో ఐదేళ్లు పని చేయించుకుని సీటు మరొకరికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే ఖర్చులు కూడా తామే పెట్టుకుంటామని అనుచరులు అన్నారు. సీటు ఇవ్వలేదంటూ ఒక్క మాట కూడా చెప్పకపోవడం అధిష్టానం అహంకారానికి నిదర్శనమని, దీని వెనుక జిల్లాకు చెందిన ఓ నాయకుడి కుట్ర ఉందని ఆరోపించారు.

పార్టీలో ఉండి అన్యాయం చేస్తే రోడ్డుకీడుస్తా

- హెచ్చరికలతో కూడిన గొండు శంకర్ వీడియో వైరల్

శ్రీకాకుళం: టీడీపీ కార్యకర్తలు గానీ, నాయకులు గానీ పార్టీ జెండా ముసుగులో అన్యాయం చేస్తే రోడ్డుకీడుస్తానని శ్రీకాకుళం టీడీపీ టికెట్ పొందిన గొండు శంకర్ హెచ్చరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. పార్టీలో ఉన్న వారంతా కచ్చితంగా పనిచేయాల్సిందేనని, మద్దతు తెలపాల్సిందేనని పరోక్షంగా హెచ్చరించినట్లు చేసిన వ్యాఖ్యలు గుండ వర్గీయుల్లో మరింత ఆజ్యాన్ని పోసింది. ఈ వీడియో చూసిన తర్వాత గుండ వర్గీయులు మరింతగా ఒత్తిడి తెస్తూ ఇండిపెండెంట్‌గా బరిలో దిగాల్సిందేనని గుండ దంపతులను కోరుతున్నారు.

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అగ్గి మంటలు వేసి హోలీ జరుపుకుంటున్న ప్రత్యేక బలగాలు



ప్రత్యేకంగా హోలీ

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎన్నికల విధుల కోసం వచ్చిన ప్రత్యేక బలగాల సిబ్బంది ఆదివారం రాత్రి ఘనంగా హోలీ నిర్వహించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల విధుల కోసం వచ్చిన వారిలో అత్యధికంగా ఈశాన్య ప్రాంతాలకు చెందిన సిబ్బంది ఉండడంతో వారి సంప్రదాయం ప్రకారం పెద్ద ఎత్తున అగ్గి మంటలు వేశారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ఎన్నికల విధులు లేకపోతే తమ కుటుంబాలతో ఈ పండుగ చేసుకునే వాళ్లమని, ప్రస్తుతానికి విధులు ఉన్న చోటే తమ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు వారంతా పేర్కొన్నారు. – టెక్కలి

'ఎన్నికల విధులకు ముందుకు రండి'

2024 సమరం సన్నద్ధం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా మాజీ సైనికుల సమాఖ్య సర్వసభ్య సమావేశం శ్రీకాకుళంలోని పెద్దరెల్లివీధిలో ఆదివారం జరిగింది. మాజీ సైనికుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడి మురళీధరరావు మాట్లాడుతూ ఈ గత 4 నెలలుగా జరిగిన కార్యక్రమాలను వివరించా రు. మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలోని మెడికవర్ హాస్పిటల్ త్వరలోనే మాజీ సైనికులకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. అలానే రాగోలులో కట్టబోయే ఇంటిగ్రేటెడ్ సైనిక భవన్‌కు అడుగులు ముందుకు పడుతున్నాయని, అవి జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్, గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు (రిటైర్డ్) మాట్లాడుతూ ఇటీవల జిల్లా ఎస్పీ పిలుపు మేరకు మాజీ సైనికులు వీలైనంత ఎక్కువ మంది ఎలక్షన్ విధులకు స్వచ్ఛందంగా రావాలని పిలుపునిచ్చారు. ఇటీవల రథసప్తమి సేవలో పాల్గొన్న మాజీ సైనికులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల ప్రతినిధి సుబేదార్ మేజర్ కంచరాన కన్నారావు (రిటైర్డ్), సంఘ హానరరీ ప్రెసిడెంట్ ఎస్.ఎల్.రావు, జనరల్ సెక్రటరీ పి. మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, స్పోర్ట్స్ పర్సన్ కె.కన్నారావు, జాయింట్ సెక్రటరీ టి.నాగరాజు, మహిళా సెక్రటరీ కె.జగ్గమ్మ, అడ్వైజర్‌లు బట్నా మూర్తి, పద్మావతి, ఏవీ జగన్మోహనరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

'అవకాశాన్ని అందిపుచ్చుకున్నాం'



నరసన్నపేట నృత్య విద్యాలయం విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక కూచిపూడి నృత్య విద్యాలయంలో శిక్షణ పొందిన నృత్యకారులు చెన్నై చెపాక్ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో కూచిపూడి నృత్యం చేసి అదరగొట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇతరులకు దక్కని ఈ అవకాశం నరసన్నపేటకు చెందిన కూచిపూడి నృత్య విద్యాలయం వారికి వచ్చింది. ఇదే అవకాశంగా 10 మంది అమ్మాయిలు ప్రతిభ చూపి సిక్కోలు జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ క్రికెట్ వేదికపై ఇనుమడింపజేశారు. ఆదివారం నరసన్నపేట చేరుకున్న వీరు తమ అనుభవాలను వివరించారు. అరుదుగా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నామని నిర్వాహకురాలు కీర్తి ప్రియ అన్నారు. చెన్నై క్రికెట్ స్టేడియంలో చేసిన నృత్యం మరువలేనిదని నృత్యకారిణి శ్రీలక్ష్మి అన్నారు. ఈ ప్రదర్శన చాలా ఆనందదాయమని మరో డ్యాన్సర్ కావ్య శ్రీ అన్నారు. తమ ప్రదర్శన అందరినీ అలరించిందని స్రవంతి పేర్కొన్నారు.

కక్షపూరిత రాజకీయాలు మాకు రావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



మంత్రి ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన కళింగ కోమట్లు

శ్రీకాకుళం రూరల్: కోపం వస్తే పెన్షన్లు తొలగించడం, కార్డులు తొలగించడం, కరెంట్ కట్ చేయడం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేతకావని, అలాంటి కక్షపూరిత పనులు కేవలం తెలుగుదేశం పార్టీకి, జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే చెల్లుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని సింగుపురం గ్రామంలో ఎస్ఎస్‌వలస, బైరివానిపేట, కృష్ణప్పపేట, కరజాడ, తండేవలస గ్రామాలకు చెందిన కళింగ కోమట్ల సంఘ నేతలతో ఆదివారం మంత్రి ధర్మాన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గంలో 20వేల మందికి ఇళ్ల పట్టాలు అందించి ఊళ్లను నిర్మించామన్నారు. చంద్రబాబు సెంటు స్థలమైనా పేదలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్ర సంపదను దోచుకునేందుకు చంద్రబాబు, రామోజీ కుట్రపూరిత రాజకీయాలకు పూనుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కళింగ కోమట్లు మంత్రి ధర్మాన సమక్షంలో పార్టీలో చేరారు. తిరుపతిలో సత్రానికి స్థలం కేటాయించారని, ఇంకా మరికొన్ని సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, అంధవరపు రామరాజు, బరాటం సంతోష్, ఊణ్ణ నాగరాజు పాల్గొన్నారు.

నగదు, మద్యం బాటిళ్ల పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హిరమండలం: హిరమండలలో ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు స్థానిక పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్బవరం మండలం ఎరుకునాయుడు పాలెం గ్రామానికి చెందిన బరికాన నూకరాజు తన కారులో రూ. 77,600 నగదు, ఒడిశాకు చెందిన నాలుగు మద్యం బాటిళ్లు తరలిస్తుండడంతో పట్టుకున్నట్లు ఎస్‌ఐ నారాయణ స్వామి తెలిపారు. వీటిని సీజ్ చేశామన్నారు.

రూ.1.95 లక్షలు పట్టివేత

పొందూరు: మండలంలోని రాపాక చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి నరసన్నపేటకు చెందిన ఎల్.నగేష్ అనే వ్యాపారి వద్ద ఎఫ్ఎస్‌టీ సిబ్బంది రూ.1.95 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరసన్నపేట నుంచి రాజాంకు కారులో వెళుతుండగా ఎఫ్ఎస్‌టీ తనిఖీ చేయగా లెక్కచూపని నగదును గుర్తించారు. నగదును, కారును స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ వై.రవికుమార్ కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచే ఓటు



- వృద్ధులు, దివ్యాంగులకు సౌలభ్యం
- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం
- జిల్లాలో 32,941 మంది ఓటర్లు



ఇచ్ఛాపురం రూరల్, టెక్కలి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. తొలిసారిగా అమల్లోకి తీసుకొచ్చిన ఈ విధానాన్ని వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన ఓటర్లు వినియోగించుకోనున్నారు. అలాంటి వారు నామినేషన్ల నోటిఫికేషన్ జారీ అయిన ఐదు రోజుల్లోగా ఫారం–12డి నింపి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. దీంతో వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. ఈ విధానంతో పోలింగ్ బూత్‌ల వద్ద కలిగే ఇబ్బందుల నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఉపశమనం లభిస్తుంది.

జిల్లాలో 18,62,931 మంది ఓటర్లు ఉండగా, అందులో 21,486 మంది దివ్యాంగులు, 11,455 మంది 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఉన్నారు. మొత్తంగా 32,941 మంది ఓటర్లు తమ ఓటును ఇంటి నుంచే వినియోగించుకునే అవకాశం ఉంది. గత ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద సరైన సౌకర్యాలు లేకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. కేంద్రానికి వెళ్లలేని పరిస్థితిలో ఓటును వినియోగించుకోలేకపోయేవారు. వారి ఇబ్బందులను గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ సారి వంద శాతం పోలింగ్ లక్ష్యంగా తొలిసారిగా ఇంటి నుంచే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఫారం–12డి స్వీకరణ

సాధారణ ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు వేయాలనుకునే వారికి బూత్ లెవల్ అధికారులు ఫారం–12డీని అందజేస్తారు. ఫారం నింపి బూత్ లెవల్ అధికారులకు నోటిఫికేషన్ జారీ అయిన ఐదు రోజుల్లో అందజేయాలి. వాటిని అధికారులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఇవ్వనున్నారు. అందులో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఎవరైనా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తామంటే వారికి ఫారం–12డీ అవసరం లేదు. పోలింగ్ కేంద్రానికి వెళ్ల వచ్చు.

రహస్యంగానే ఓటు..

ఇంటి నుంచే ఓటు వేసే వారికోసం ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఫారం–12డీ దరఖాస్తు చేసుకున్న ఓటరు ఇంటికి బూత్ లెవల్ అధికారులు వెళ్లి బ్యాలెట్ బాక్స్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన చోట ఓటరు రహస్యంగా తన ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఇద్దరు పోలింగ్ అధికారులు, పోలీసు అధికారితో పాటు ఓ వీడియో గ్రాఫర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ప్రక్రియనంతా వీడియోగ్రఫీ చేస్తారు. ఈ ప్రక్రియ ఎన్నికలకు ఒకరోజు ముందుగానే పూర్తి చేస్తారు.

క్లుప్తంగా

ఎన్టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్



ఎన్టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టెక్కలి సీఐ పి.పైడయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీలోని పలువీధుల్లో తనిఖీలు చేశారు. వీధుల్లో అక్రమ మద్యం, సారా వంటి నిల్వలు ఉన్నాయో లేవో పరిశీలించారు. అనంతరం వీధిలో ఉన్న ద్విచక్రవాహనాల రికార్డులు పరిశీలించారు. సరైన రికార్డులు లేని సుమారు 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సరైన రికార్డులు చూపించి తమ వాహనాలను తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ సెర్చ్‌లో ఎస్ఐ లక్ష్మి, ఎస్ఐ-2 వెంకటేశ్వరరావుతో పాటు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారులకు రక్తదానం



రక్తదానం చేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఆదిల్ షా

వజ్రపుకొత్తూరు రూరల్: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో నువ్వలరేవు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆదిల్ షా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అనంతరం రక్తదానం చేసిన దాతలను రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు బెగాం, నంది ఉమాశంకర్ తదితరులు ఉన్నారు.

టీడీపీ కండువాతో ఆర్మీ ఉద్యోగి



పార్టీ కండువాతో ఫొటోకు ఫోజులిస్తున్న ఇండియన్ ఆర్మీ ఉద్యోగి కొంకి సత్యం

టెక్కలి: ఈ ఫొటోలో టీడీపీ కండువాతో వృత్తంలో ఉన్న వ్యక్తి నందిగాం మండలం పెద్దతామరాపల్లి పంచాయతీ మద్దిలవానిపేట గ్రామానికి చెందిన ఇండియన్ ఆర్మీ ఉద్యోగి కొంకి సత్యం. ఇటీవల కోటబొమ్మాళిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో ఆ పార్టీలో చేరడమే కాకుండా కండువాలతో సైతం ఇలా ఫొటోలకు ఫోజులివ్వడం పలువురిని ఆశ్చర్యపరిచింది. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ టీడీపీ కండువాలను ధరించడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధికారులకు ఫిర్యాదు చేశారు.

భక్తితో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



శ్రీచక్రసిరిజ్యోతి పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేణ సిరిజ్యోతి పూజలు ఆదివారం జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రానికి దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

విభిన్న ప్రతిభావంతులకు బాసట



సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కార్యాలయం

- ఉపకరణాల పంపిణీకి సమగ్రశిక్ష చర్యలు
- 26 నుంచి 28వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం పంపిణీ

శ్రీకాకుళం న్యూకాలనీ: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ జిల్లా అధికారులు తీపికబురు అందించారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలను (శారీరక వైకల్యం, వినికిడిలోపం, తీవ్రబుద్ధి మాంద్యత, చలన వైకల్య లోపం) డివిజన్ స్థాయిలో పరీక్షించి ఉపకరణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష పథకం ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమయ్యే ట్రైసైకిల్, వీల్‌చైర్, సీపీ చైర్, రొటేటర్, బీటీఈ(వినికిడి పరికరం, కాలి పర్సు) తదితర ఉపకరణాలను అందజేందుకు పకడ్బందీగా చర్యలు తీసుంటున్నారు.

వసతి, సౌకర్యాలు అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 5 కేంద్రాల్లో పరీక్షలు జరిపి, అనంతరం ఉపకరణాలను అందజేయనున్నారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆయా కేంద్రాలకు సమీపంలోని మండలాల పిల్లలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం జరగనుంది. ఈ మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపునకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు/సంరక్షకులకు రవాణా చార్జీలు, టీ, స్నాక్స్, భోజనం, వసతి కల్పించేలా సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్ నేతృత్వంలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



శ్రీకాకుళం భవిత కేంద్రం

ఈ పత్రాలు తప్పనిసరి..

ఈ క్యాంప్‌నకు హాజరయ్యే విద్యార్థులు వారి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌కాపీలు, 3 పాస్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలి. వారు హాజరుకావాల్సిన కేంద్రం వద్దకు ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు చేరుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు వారి భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్పీలను సంప్రదించాలి.

ఐదు కేంద్రాల్లో మూడు రోజుల పాటు..

- 26వ తేదీన శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియం (కోడిరామ్మూర్తి స్టేడియం సమీపం) వేదికగా పరీక్షలు, ఉపకరణాల పంపిణీ జరుగుతుంది. ఇక్కడకు శ్రీకాకుళంతోపాటు గార, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం, పొందూరు, ఆమదాలవలస మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 26వ తేదీన ఎల్ఎన్‌పేట భవిత కేంద్రం(ఎంపీపీఎస్ స్కూల్) వేదికగా జరిగే పరీక్షలు, ఉపకరణాల పంపిణీకి ఎల్ఎన్‌పేటతోపాటు బూర్జ, హిరమండలం, కొత్తూరు, సరుబుజ్జిలి మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 27న నరసన్నపేట (ఎంఆర్సీ కేంద్రం) వద్ద జరిగే పరీక్షలు, ఉపకరణాల పంపిణీకి నరసన్నపేటతోపాటు పోలాకి, జలుమూరు, సారవకోట, కోటబొమ్మాళి మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 27న కంచిలి (జెడ్పీహెచ్‌స్కూల్) వేదికగా జరిగే పరీక్షలు,ఉపకరణాల పంపిణీకి కంచిలితోపాటు ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, పలాస మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 28న టెక్కలి భవిత కేంద్రం (తహసీల్దార్ కార్యాలయం సమీపం) వేదికగా జరిగే పరీక్షలు, ఉపకరణాలకు టెక్కలితోపాటు నందిగాం, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాలగల పిల్లల కోసం వారికి అవసరమైన, ఉపయుక్తమైన ఉపకరణాలను ఈ ఏడాది కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సమగ్ర శిక్ష పీడీ ఆదేశాల మేరకు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈనెల 26 నుంచి 28 వరకు జిల్లాలో 5 కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలగల పిల్లలకు పరీక్షలు నిర్వహించి, ఉపకరణాల పంపిణీ చేస్తున్నాం. మండలాలవారీగా నిర్దేశించిన వారి కేంద్రానికి చేరుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఏపీసీ శ్రీకాకుళం జిల్లా

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక సందడి కనిపించింది. స్థానిక జిల్లా నుంచే కాక ఇరుగు పొరుగు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు వత్సవలస రాజులమ్మ జాతర సందర్భంగా ఆదివారం వేకువజాము నుంచే భక్తులు కుటుంబాలతో కలిసి విచ్చేయడంతో ముందుగా అరసవల్లి ఆదిత్యుడిని దర్శించుకునేందుకు క్యూలలో బారులు తీరారు. ఇంద్రపుష్కరిణి ఆవరణలో రావిచెట్టు వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఒక్క ఆదివారంలో మొత్తంగా రూ.5,69,584 ఆదాయం లభించింది. ఇందులో వివిధ దర్శనాల మార్గాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,21,800, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.62,784, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.85 లక్షల ఆదాయం లభించినట్లుగా ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తెలియజేశారు.



కేశఖండన శాలలో మొక్కులకు బారులు తీరిన భక్తులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో ఆదివారం ఇప్పిలి గణపతిరావు మాస్టారు జ్ఞాపకార్థం జిల్లాస్థాయి బల ప్రదర్శన పోటీలు సందడిగా నిర్వహించారు. త్రినాథస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఏటా ఈ జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. 80 కిలోల విసురుగుండు పోటీలలో ఒప్పంగి గ్రామానికి చెందిన గేదెల సత్యనారాయణ ప్రథమ, ఎస్.రజాక్ ద్వితీయ బహుమతి పొందారు. అలాగే 100 కిలోల సంగిడి పోటీల్లో గేదెల సత్యనారాయణ, ఎస్.రజాక్, ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆవల గోవిందరావు 160 కిలోలు ఎత్తి ప్రథమ, ఎస్.రజాక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో సీహెచ్ రాజ్యలక్ష్మి, గుజ్జల వర్షిత ఇద్దరూ 100 కిలోల బరువు ఎత్తడంతో ఉమ్మడిగా ప్రథమ బహుమతి అందజేశారు. అలాగే 250 కిలోల ఈడ్పు సంగిడి పోటీల్లో ఆవల గోవిందరావుకు ప్రథమ, ఎస్.రజాక్, ఆవల వసంతలకు ఉమ్మడిగా ద్వితీయ బహుమతి అందజేశారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలను పీడీ ఈశ్వరరావు, పవర్ వెయిట్ లిఫ్టింగ్ గౌరవ అధ్యక్షుడు బి.తిరుపతిరావు, సూర్యనారాయణల సమక్షంలో నిర్వహించారు. విజేతలకు శివ ప్రియ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, వైఎస్సార్ పార్టీ నాయకులు మెండ రాంబాబు, చిన్నాల వెంకట సత్యనారాయణలు, శివ ప్రియ ట్రస్టు చైర్మన్ రెడ్డి శివన్నారాయణలు బహుమతులు అందించారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 160 కిలోల బరువు ఎత్తుతున్న ఆవల గోవిందరావు

బాలిగాం రైల్వే గేటును ఢీకొన్న ఆటో



గేటు పైకి లేవకపోవడంతో ప్రయాణికుల పాట్లు

మందస: మందస రైల్వేస్టేషన్(కొత్తకమలాపురం) సమీపంలో గల బాలిగాం రైల్వే గేటును ఓ ఆటో ఆదివారం ఢీకొంది. గేటు విరిగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. హరిపురం నుంచి మందస వెళ్తున్న లగేజీ ఆటో రైల్వేగేటు ఢీకొనడంతో గేటు ఓ వైపు విరిగిపోయింది. రెండో వైపు పని చేస్తున్నప్పటికీ, విరిగిన గేటు పైకి లేవకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఇదే ట్రాక్‌లో వెళ్లాల్సిన పూరి-వాకా(అప్)తో పాటు మరో రైలు కూడా సిగ్నల్ లేకపోవడంతో గేటు ముందు ఆగిపోయాయి. పరిస్థితిని గేటుమేన్ పలాస టెక్నికల్ టీం, ఆర్పీఎఫ్ పోలీసు లకు వివరించారు. తక్షణమే చేరుకున్న టెక్నికల్ సిబ్బంది గేటును బాగు చేశారు. సంఘటనకు కారణమైన ఆటోను గుర్తించిన డ్రైవర్ టి.బాబ్జీపై ఆర్పీఎఫ్ ఎస్ఐ మల్లాద్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కా'పాడి' చూపిస్తున్నారు..

- సమర్థంగా పనిచేస్తున్న పశు విజ్ఞానబడి
- అన్ని మండలాల్లో ప్రతివారం నిర్వహణ
- పాడి అభివృద్ధితో మారుతున్న రైతుల బతుకులు

కంచిలి: పశు విజ్ఞాన బడులు రైతులకు కొత్త నేస్తాలుగా మారాయి. వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పశు విజ్ఞాన బడుల పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పశు పెంపకదారులు శాస్త్రీయ పద్ధతులు అవలంబించేలా అవగాహన కల్పిస్తోంది. దూడల మరణాలు తగ్గించడం, పాల ఉత్పత్తి పెంచడం, జీవాలు వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం తదితర అంశాలపై ప్రతి వారం ఆర్బీకేల్లో చర్చించి పశుపోషణలో రాణించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

పశుసంవర్ధకశాఖ 2022-23 నుంచి వినూత్నంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ విజ్ఞానాన్ని పెంచుతోంది. అన్నదాతలకు వ్యవసాయం ఎంత ముఖ్యమో, పాడి కూడా అంతే ప్రధానం. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ఈ కార్యక్రమం పాడి పరిశ్రమలో రాణిస్తున్న వారికి, జీవాలు, కోళ్ల పెంపకందారులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. వ్యవసాయ శాఖ పొలంబడి, ఉద్యానశాఖ తోటబడి పేరుతో రైతులకు వివిధ పంటల సాగుపై అవగాహన కల్పిస్తోంది. ఆ తరహాలోనే పశుసంవర్ధకశాఖ పశు విజ్ఞానబడి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. శ్రీకాకుళం జిల్లాలో అన్ని మండలాల్లో గల రైతుభరోసా కేంద్రాల్లో ఈ పశు విజ్ఞానబడిని నిర్వహిస్తున్నారు. ఈ పశువిజ్ఞాన బడుల్లో పాడి రైతులకు అవగాహన కల్పించడానికి అన్నిస్థాయిల అధికారులు హాజరై సూచనలు ఇస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న అంశాలివే..

పది శాతం ఉన్న దూడల మరణాలను తగ్గించడానికి కృషి చేస్తున్నారు. పరిశుభ్రమైన పాల ఉత్పత్తి, పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను వివరించడం, పాడి పశువులకు దాణామృతం, సమీకృత దాణా అవసరాన్ని తెలియజేయడం, దేశీయ ఆవుల పెంపకం, పాల ఉత్పత్తి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో యువకుల చేరిక



మంత్రి అప్పలరాజు సమక్షంలో పార్టీలోకి చేరిన శాసనాం యువకులు

కాశీబుగ్గ: రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో పలాస మండలం శాసనాం గ్రామానికి చెందిన యువకులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలో కిడ్నీ ఆస్పత్రి, శుద్ధజలం ప్రాజెక్టు, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసిన ఘనత సీదిరి అప్పలరాజుకు దక్కుతుందని వారు అన్నారు. ఇలాంటి పనులు చూసి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని అన్నారు. సుమారు 50 మందికి పైగా యువత చేరారు. కార్యక్రమంలో పార్టీ యువజన నాయకులు రాకేష్‌రెడ్డి, విక్కీ, సంతోష్, హరీష్, సురేష్, కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన కార్యకర్తలు

నరసన్నపేట: జగన్నాథపురానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు పట్ట శ్రీను, తమడాన తవిటయ్య, బరాటం గోవిందరావు, ధర్మాన గోవిందరావు, పసుపు రెడ్డి మురళీ,ధనింశెట్టి జగన్నాథంతో పాటు మరో 10 మంది ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ సమక్షంలో వీరు పార్టీలో చేరారు. పట్ట శ్రీను మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పాగోటి జయలక్ష్మి, పంచాయతీ వార్డు తమడాన సుజాత తదితరులు పాల్గొన్నార



పార్టీలో చేరిన వారితో ధర్మాన పద్మప్రియ

దహన సంస్కారాలు ఇక సులువు



గ్యాస్ క్రిమటోరియం

- శ్రీకాకుళంలో రూ.1.47కోట్లతో గ్యాస్ క్రిమటోరియం
- పర్యావరణ పరిరక్షణ దిశగా చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కేంద్రంలో దహన సంస్కారాలకు ఇన్నాళ్లు పడిన ఇబ్బందులకు ఇక చెక్ పడనుంది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పదుల సంఖ్యలో మృతదేహాలకు దహన సంస్కారాలు చేస్తుంటే కొత్త వంతెన వద్ద నాగావళి నదీ తీరంలో తీవ్ర దుర్వాసన వచ్చేది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారంతా ముక్కులు మూసుకుని వెళ్లేవారు. రోడ్డు పక్కనే కావడంతో మంటలను చూసి చిన్న పిల్లలు, మహిళలు తీవ్ర భయాందోళనకు గురయ్యేవారు. ఈ విషయం మంత్రి ధర్మాన ప్రసాదరావుకి తెలియడంతో వెంటనే దానికి ప్రత్యామ్నాయ పరిష్కారం చేయాలని ఆలోచన చేశారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేయగా రూ.1.47కోట్లు నిధులు మంజూరుచేశారు. దుర్వాసనకు, చిన్నారులు, మహిళల భయాందోళనకు చెక్ పెట్టాలంటే గ్యాస్ క్రిమటోరియం ఒక్కటే మార్గమని నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేశారు. దీని చుట్టూ చక్కనైన మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుచేశారు. భవన నిర్మాణంతో పాటు గార్డెన్ ఏర్పాటుచేసి, అందులో మిషనరీ కూడా పెట్టేశారు. అన్నీ పూర్తయిన సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి అడ్డుపడింది. లేకుంటే గ్యాస్ క్రిమటోరియం సేవలు అందుబాటులోకి వచ్చేవి.



గ్యాస్ క్రిమటోరియం వద్ద గార్డెనింగ్

డోలోత్సవ పుణ్యస్నానం



సముద్ర తీరంలో భక్తులు

గార: శ్రీకూర్మనాథుని డోలోత్సవాల్లో మూడో రోజు ఆదివారం సముద్ర స్నానాలతో భక్తులు పరవశించారు. పడియా సందర్భంగా సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీకూర్మనాథుని సన్నిధిలోని శ్వేత పుష్కరిణిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు వేకువజామున స్వామి వారికి విశేష అర్చనలు జరిపారు. సోమవారం కూడా పుణ్యస్నానాలు ఉంటాయి. అలాగే డోలో మండపంలో స్వామి ఉత్తరాభిముఖంగా భక్తులకు దర్శనమిస్తారు.

రట్టికి పోటెత్తిన భక్తజనం



వల్లభ నారాయణస్వామి డోలోత్సవానికి పోటెత్తిన భక్తులు

మందస: ఉద్దానంలో వెలసిన వల్లభ నారాయణ స్వామి డోలోత్సవానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నెల 20న డోలోత్సవాలు ప్రారంభం కాగా, ఈ నెల 25వ తేదీతో ముగుస్తాయి. భేతాళపురం పంచాయతీ రట్టిలో గల శ్రీవల్లభనారాయణస్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. చివరి రెండు రోజుల దూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో స్వామిని దర్శించుకుంటారు. పలాస ఆర్టీసీ డిపో యాజమాన్యం భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సోమవారంతో ఉత్సవాలు ముగియనుండడంతో ఆదివారం భక్తులు భారీసంఖ్యలో హాజరయ్యారు.